సాక్షి అనకాపల్లి

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



పవిత్రోత్సవాలు 8లో

సింహగిరిపై పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించి, ఆలయ శిఖరాలకు పవిత్ర సమర్పణ చేశారు.



దుర్గాదేవిని పూజిస్తే.. 8లో

అనకాపల్లిలో సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు ముగిశాయి. ఆయన వివరించిన పరమేశ్వరి వైభవాన్ని భక్తులు శ్రద్ధగా ఆలకించారు.



ఓజోన్ డే ర్యాలీ

బీచ్‌రోడ్డు: విశాఖ సాగరతీరంలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

న్యూస్‌రీల్

19న గవర్నర్ విశాఖ రాక



మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈనెల 19న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో గురువారం మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా నొవోటెల్ హోటల్‌కు వెళ్లి అక్కడ బస చేస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు ఏయూ మెరైన్ విభాగంలో జరిగే దివ్య కళా మేళాలో పాల్గొంటారు. అనంతరం నొవోటెల్ హోటల్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 20న సాయంత్రం 6.55 గంటలకు విమానంలో విజయవాడ బయలుదేరుతారు.

స్వయంభూ వినాయకుడి లడ్డూ వేలం



22 కేజీల లడ్డూతో భక్తులు, అర్చకులు

చోడవరం: పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో భారీ లడ్డూ వేలం సోమవారం నిర్వహించారు. వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా ఇక్కడ 22 కేజీల లడ్డూను తయారు చేసి స్వామివారి దగ్గర ఉంచారు. ఈ లడ్డూ వేలంలో పాడేందుకు అనేక మంది భక్తులు పోటీ పడతారు. చివరికి వైఎస్సార్‌సీపీ నాయకుడు శరగడం చిమ్మినాయుడు రూ. 20 వేలకు దక్కించుకున్నాడు. లడ్డూను ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు, చైర్మన్ సాంబశివరావు, దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణమూర్తి అందజేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు పూడిమడక యువకుడు



ఎంపికైన తులసీ పైడయ్యనాయుడు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన రాజాన తులసీ పైడియ్యనాయుడు జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. అండర్–16 విభాగంలో జరిగిన పోటీల్లో పైడయ్యనాయుడు అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. ఈ నెల 25వ తేదీ నుంచి హర్యానాలో జరిగే పోటీల్లో పాల్గొంటాడు. గతేడాది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించాడు. తాజాగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేవల్ అధికారులకు ముగిసిన శిక్షణ

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో ఆరురోజుల పాటు ఇండియన్ నేవల్ ఆర్మమెంట్ సర్వీస్ అధికారులకు జరిగిన శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఎన్ఏడీ చీఫ్ జనరల్ మేనేజర్ పీజీ నెవేర్ పాల్గొన్నారు. భారత నౌకాదళానికి ఎన్ఏడీ పాత్ర, సహకారం గురించి శిక్షణలో వివరించారు. ట్రైనీ అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించవలసిన విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.రంగాచార్యులు, కో డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కల చెదిరింది..



మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేస్తే మాలాంటి సామాన్య, మధ్య తరగతి ప్రజల పిల్లలు డాక్టర్ అవ్వాలన్న కల చెదిరిపోతుంది. కొత్త మెడికల్ కాలేజీలు వస్తాయన్న నమ్మకంతో నా కుమారుడిని ఇంటర్ బైపీసీ చదివిస్తున్నాను. చంద్రబాబు సర్కారు నిర్దయగా వ్యవహరించడంతో పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న ఆందోళన మొదలైంది. ప్రభుత్వ విధానాలు రాజకీయాలకు అతీతంగా ఉండాలి. వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందన్న భయంతో నిర్మాణంలో ఉన్న కాలేజీలను అర్ధంతరంగా ఆపేస్తే.. అందువల్ల వచ్చే చెడ్డపేరు ఇప్పటి ప్రభుత్వం భరించాల్సిందే కదా.

– వల్లా లోవ, విద్యార్థి తల్లి, బుదిరెడ్లపాలెం, బుచ్చెయ్యపేట మండలం



బుచ్చెయ్యపేట/అనకాపల్లి:

వైద్య విద్య అందనంత దూరం



కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే కూటమి ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలి. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజన విద్యార్థులకు తీరని అన్యాయం చేసే నిర్ణయమిది. రాష్ట్రంలో నిర్మాణదశలో ఉన్న అన్ని మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలి. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూరాలని చూస్తే ప్రభుత్వం సంక్షేమ పాలన నుంచి తప్పుకున్నట్టు భావించాల్సి వస్తుంది. విద్యను వ్యాపారం చేయడం వల్ల అన్ని వర్గాల ప్రజలు అప్పుల పాలవుతారు.

–బొట్టా చిన్నయాదవ్, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, అనకాపల్లి

● భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



కశింకోటలో ఈద్-మిలాద్-ఉన్-నబీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని సోమవారం జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. వేడుకలో భాగంగా ముస్లింలు కశింకోట, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కశింకోటలోని జామియా, నూరి మసీదులు, అబ్దుల్ అజీషా ఖాదరి బాబా దర్గా, బయ్యవరంలోని అన్సర్ మద్నీ ఔలియా దర్గాలను సందర్శించి ముస్లింలు ప్రార్థనలు చేశారు. ముస్లిం ప్రతినిధులు అబ్దుల్ కలాం అజాద్, మౌలానా నసీం, మక్బూల్, మౌలానా జాఫర్, ఎస్‌కె బుఖారి, సయ్యద్ సలీం, సయ్యద్ తాజుద్దీన్, అబ్దుల్ మజీద్, నూర్ నబి, సయ్యద్ రెహమతుల్లా, ఎస్ఎంఎస్ అలీ, ఎంఎ రబ్బాని తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. – కశింకోట/అనకాపల్లి





విశాఖలో శాంతి ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు, (ఇన్‌సెట్) మువ్వన్నెలతో ఆకట్టుకున్న ప్రదర్శన

నేడే అనంతుని జయంతి



అనంతుని ఉత్సవ విగ్రహాలు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో మంగళవారం జరగనున్న అనంతుని జయంతికి భక్త బృందం సభ్యులు, ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీదేవి, భూదేవి, అనంతుని ఉత్సవ విగ్రహాలకు నూతన వస్త్రాలను సమకూర్చారు. ఆలయ భోగం, ముఖ ద్వారం, బేడా మండపాన్ని మామిడి, అరటి తోరణాలతో సుందరంగా అలంకరించారు. గతంలో బేడా మండపంలో అనంతుని వ్రతాలు నిర్వహించేవారు. ఈ సారి కల్యాణ వేదిక వద్ద వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు వ్రతాలు నిర్వహించుకోవడానికి టెంట్లు ఏర్పాటు చేశారు. వ్రతాలు ఉదయం 7.30 గంటలకు ప్రారంభమవుతాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురుకాకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

తడబడిన వసూళ్లు.. తగ్గిన రాబడి

- వెనుకబడిన మార్కెట్ కమిటీలు
- 2024–25 ఏడాది లక్ష్యం రూ.9.07 కోట్లు
- ఇప్పటివరకు వసూలైంది రూ.2.63 కోట్లు మాత్రమే
- సెస్సు వసూళ్లలో సిబ్బంది నిర్లక్ష్యం
- చెక్‌పోస్టుల్లో జోరుగా జీరో దందా

యలమంచిలి రూరల్: జిల్లావ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయం క్షీణించింది. చెక్‌పోస్టుల్లో సెస్సు వసూళ్లలో జోరు తగ్గింది. కరోనా సమయంలో తప్ప గత ఐదేళ్లలో గణనీయమైన ఆదాయం ఆర్జించిన మార్కెట్ కమిటీల వసూళ్లు తగ్గిపోయాయి. సంపద సృష్టించాల్సిన చెక్‌పోస్టుల్లో జీరో వ్యాపారం జోరందుకోవడంతో ఆదాయంపై తీవ్ర ప్రభావం పడుతోంది. జిల్లాలో ఈ ఏడాది రూ.9.07 కోట్లను సెస్సు రూపంలో వసూలు చేయాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటివరకు ఐదున్నర నెలల కాలంలో కేవలం రూ.2.63 కోట్లను మాత్రమే సిబ్బంది వసూలు చేశారు. జిల్లాలో మాడుగుల, చోడవరం కమిటీలు చివరి రెండు స్థానాల్లో, యలమంచిలి మొదటి స్థానంలో నిలిచాయి. ఏడాది పొడవునా జరిగిన వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలకు సంబంధించిన మొత్తంలో వరికి 2 శాతం, మిగిలిన ఉత్పత్తులకు 1 శాతం మార్కెట్ ఫీజు వసూలు చేయాల్సి ఉంటుంది.

చెక్‌పోస్టుల వద్ద చేతివాటం

జిల్లాలో పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగులలో వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యం రూ.9.07 కోట్లుగా నిర్దేశించారు. మార్కెట్ కమిటీల పరిధిలో సిబ్బంది చెక్‌పోస్టుల ద్వారా సెస్సు వసూళ్లను చేస్తున్నారు. వీటిలో 16వ నెంబరు జాతీయ రహదారిపై చెక్‌పోస్టులు ఉన్న పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి కమిటీలకు ఎక్కువ ఆదాయం సమకూరుతోంది. అయితే చెక్‌పోస్టుల వద్ద సెస్సు వసూళ్లు చేసే సిబ్బంది చేతివాటానికి పాల్పడుతుండటంతో ప్రతి ఏటా నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడంలో మార్కెట్ కమిటీలు విఫలమవుతున్నాయన్న విమర్శలున్నాయి. జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులు అవినీతికి కేంద్రాలుగా మారాయి. జీరోపై వెళుతున్న వ్యవసాయ ఉత్పత్తులను చెక్‌పోస్టుల్లో సిబ్బంది పట్టుకుని ఫీజు వసూళ్లు చేయాల్సి ఉన్నా, అందులో పనిచేసే కొందరు సిబ్బంది మామూళ్లు దండుకుని వదిలేస్తున్నారు. బయట మిల్లుల నుంచి తరలించే వ్యవసాయ ఉత్పత్తులు జీరోపై వెళుతున్నా పట్టించుకోవడంలేదు. పలుచోట్ల లారీల్లో వేలాది బస్తాల వరి ధాన్యం జీరోపై తరలిపోతోంది. ఇలాంటి వాటికి వ్యాపారులు మార్కెట్ ఫీజులకు ఎగనామం పెడుతున్నారు. మార్కెట్ కమిటీల చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది చేతివాటం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.



అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం



రేగుపాలెం చెక్‌పోస్టు

జిల్లా వ్యాప్తంగా వసూలైన సెస్సు వివరాలు

మార్కెట్ కమిటీ	ఈ ఏడాది లక్ష్యం (రూ.లక్షల్లో)	ఈ ఏడాది వసూళ్లు (రూ.లక్షల్లో)
అనకాపల్లి	193	58.42
నర్సీపట్నం	200	54.94
యలమంచిలి	196	61.96
చోడవరం	96	17.26
పాయకరావుపేట	168	54.48
మాడుగుల	54	16.91
మొత్తం	907	263.97

మార్చినాటికి లక్ష్యాన్ని అధిగమిస్తాం



జిల్లాలో 2024–25 ఏడాదికి మార్కెట్ కమిటీల పరిధిలో రూ.9.07 కోట్ల వార్షికాదాయం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎన్నికల కారణంగా ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో వసూళ్లు నిరాశాజనకంగా ఉన్నప్పటికీ వచ్చే మార్చికల్లా లక్ష్యాన్ని అధిగమిస్తాం. చెక్‌పోస్టుల్లో జీరో వ్యాపారం జరిగితే చర్యలు తీసుకుంటాం. చెక్‌పోస్టుల వద్ద పర్యవేక్షణ పెంచుతాం. ఎక్కడైనా సిబ్బంది అవినీతికి పాల్పడినట్టు తేలితే చర్యలు తీసుకుంటాం.

–బి.రవికిరణ్, అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి, అనకాపల్లి

నేటి నుంచి దివ్యాంగ పింఛన్ వెరిఫికేషన్

తుమ్మపాల: అకాల వర్షాలతో నిలిచిపోయిన దివ్యాంగ పింఛన్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని మంగళవారం పునఃప్రారంభిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదవశాత్తు వికలాంగులైన పింఛనుదారుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ స్పెషల్ డ్రైవ్‌ను గత నెలలో ప్రారంభించినప్పటికీ తీవ్ర వర్షాల నేపథ్యంలో మధ్యలోనే నిలిపివేశారు. అనకాపల్లి పట్టణంలో ఎన్టీఆర్ స్టేడియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగవైకల్యంతో పాటు సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేస్తారన్నారు. ప్రమాదవశాత్తు వైకల్యం పొందిన వారి కోసమే ప్రత్యేక సదరం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అంధత్వం, చెవిటి, మూగ, మానసిక రోగులు దీనికి అనర్హులన్నారు. కొత్తగా పింఛన్ల మంజూరు సర్టిఫికెట్ల జారీ కూడా జరగదని, ఈ విషయం గమనించాలన్నారు. 17న సబ్బవరం, కె.కోటపాడు మండలాలు, 18న నర్సీపట్నం, పాయకరావుపేట, 19న కశింకోట, యలమంచిలి, 20న కోటవురట్ల, నక్కపల్లి, 21న నాతవరం, గొలుగొండ, 23న రావికమతం, రోలుగుంట, 24న దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, 25న ఎస్.రాయవరం, మాకవరపాలెం, 26న చీడికాడ, మాడుగుల మండలాల వారికి ఎన్టీఆర్ ఆస్పత్రిలో వెరిఫికేషన్ జరుగుతుందన్నారు.

ఫార్మా కంపెనీల్లో కార్మికుల భద్రత డొల్ల

- యాజమాన్యాల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి
- కంపెనీల భద్రతపై ప్రభుత్వ తనిఖీల్లో అలసత్వం
- ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు సీపీఎం రక్షణ యాత్ర
- నాలుగు రోజులపాటు జిల్లాలో బైక్ యాత్రతో ప్రచారం
- పాయకరావుపేట నుంచి ప్రారంభం



నక్కపల్లి మండలంలో యాత్రలో పాల్గొన్న సీపీఎం కార్యకర్తలు, కార్మికులు

నక్కపల్లి/పాయకరావుపేట: యాజమాన్యాల నిర్లక్ష్యం, ప్రభుత్వాల ఉదాసీనత కారణంగా ఫార్మా, సెజ్ కంపెనీల్లో నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని, దీనికి ఇటీవల అచ్యుతాపురం ఎసైన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదమే ఉదాహరణ అని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఫార్మా కంపెనీల్లో కార్మికులకు భద్రత కల్పించాలంటూ ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు సీపీఎం రక్షణ యాత్ర సోమవారం పాయకరావుపేటలో ప్రారంభమయింది. నాలుగు రోజుల పాటు అనకాపల్లి జిల్లాలో జరగనున్న ఈ యాత్రను పాయకరావుపేటలోని మంగవరం రోడ్డు జంక్షన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగ్గునాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తదితరులు మాట్లాడుతూ జిల్లాలో గత 25 సంవత్సరాల్లో జరిగిన ఫార్మా కంపెనీ ప్రమాదాల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆగస్టు 21న ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోవడం దారుణమన్నారు. మరో 38 మంది తీవ్రగాయాల పాలయ్యారన్నారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో 120 ప్రమాదాలు జరిగి 140 మంది మరణిస్తే, ఒక్క అనకాపల్లి జిల్లాలో ఆరేళ్ల కాలంలో 54 కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 62 మంది చనిపోయినట్లు తెలిపారు. 92 మంది క్షతగాత్రులయ్యారన్నారు. లెక్కకు రాని మరణాలెన్నో ఉన్నాయన్నారు. ఎస్ఈజెడ్‌లో ఏర్పాటయ్యే కంపెనీలు ప్రభుత్వాల నుంచి రాయితీపై భూములు, నీరు, కరెంట్ వంటి మౌలిక వసతులు పొందుతూ కార్మికుల భద్రత, రక్షణను పట్టించుకోవట్లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీల వ్యాపారాల కోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో ఫ్యాక్టరీలను తనిఖీ చేయకుండా, అధికారులపై ఆంక్షలు విధిస్తున్నారని ఆక్షేపించారు. దీంతో ప్రమాదాలు మరిన్ని పెరుగుతున్నాయని, యాజమాన్యాలు కార్మికుల భద్రతను సీరియస్‌గా తీసుకోవడం లేదని ఆరోపించారు.

మొద్దునిద్రలో చెకింగ్ వ్యవస్థలు

మోదీ ప్రభుత్వం 2016లో కంపెనీల్లో కంప్యూటర్ ఆధారిత తనిఖీల విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలు ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.62 తెచ్చి, రెగ్యులర్ తనిఖీలను అటకెక్కించారని మండిపడ్డారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, లేబర్ డిపార్ట్‌మెంట్, ఫైర్, బాయిలర్ చెకింగ్ వ్యవస్థలు మొద్దునిద్రలో ఉన్నాయని ఎద్దేవా చేశారు. కోట్లాది రూపాయల లాభాలనార్జిస్తూ కుబేరులవుతున్న మందుల కంపెనీల యాజమాన్యాలు నూతన టెక్నాలజీ వచ్చినా ఖర్చుకు వెనుకాడి ప్రమాదాలను కొనితెస్తున్నారని మండిపడ్డారు. పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో అమాయక కార్మికులు నష్టపోతున్నారని, కంపెనీలు ఇచ్చే పరిహారాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయన్నారు. కంపెనీల్లో కార్మికుల ప్రాణాలకు రక్షణ, భద్రత కల్పించడంతో పాటు కంపెనీల్లో జరుగుతున్న నిర్లక్ష్యాలను ప్రజలకు వివరించడం, వారిలో చైతన్యం తీసుకురావడం కోసమే నాలుగు రోజుల పాటు జిల్లాలో ఈ మోటార్ సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. పాయకరావుపేట మంగవరం, సత్యవరం, గోపాలపట్నం మీదుగా నక్కపల్లి మండలంలోకి యాత్ర చేరింది. గునిపూడి, నెల్లిపూడి అమలాపురం, పాటిమీద, మూలపర, చందనాడ, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట ఉపమాక మీదుగా నక్కపల్లి చేరుకుంది. నక్కపల్లి మండలంలో పలువురు సీపీఎం కార్యకర్తలు, సీఐటీయూ, కార్మిక సంఘాల వారు యాత్రకు స్వాగతం పలికారు. ఈ యాత్రలో స్థానిక సీపీఎం నాయకులు మనబాల రాజేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖను వదలం

'ఏజెన్సీలో చాలా ఏళ్ల నుంచి పనిచేస్తున్నాం.. మాకు కూడా మైదాన ప్రాంతాల్లో పనిచేయాలని ఉంటుంది..ప్రభుత్వ జీవో ప్రకారం బదిలీలు జరుగుతాయని ఎదురుచూస్తున్నాం ..కానీ ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసు లేఖలకు ప్రాధాన్యం ఇస్తారని ఊహించలేదు. ప్రభుత్వ జీవో ప్రకారం నిష్పక్షపాతంగా బదిలీలు జరపాలి' అని అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీవోలు కోరుతున్నారు. సిఫార్సు లేఖలు పెద్ద సంఖ్యలో రావడంతో ఇప్పుడు తమ పరిస్థితి అయోమయంగా మారిందని ఆందోళన చెందుతున్నారు.

–మహారాణిపేట (విశాఖ)

- ఏజెన్సీకి వెళ్లలేం
- పైరవీలతో తహసీల్దార్లు, ఎంపీడీవోల ప్రయత్నాలు
- బదిలీల్లో అధికారపార్టీ సిఫార్సులకే ప్రాధాన్యం
- ఏళ్ల నుంచి మన్యంలో పనిచేస్తున్న వారికి అన్యాయం
- నిబంధనలకు అనుగుణంగా బదిలీలు చేయాలని వినతి

వివిధ ప్రభుత్వ శాఖలో కొంతమంది అధికారులు సర్వీసులో చేరిన నాటి నుంచి పదవీ విరమణ అయ్యే వరకు విశాఖలోనే ఉండాలని కోరుకుంటున్నారు. దీని కోసం ఎలాంటి పైరవీలకైనా సిద్ధపడుతున్నారు. తమ పరిచయాలు వినియోగించుకుంటున్నారు. అధికారపార్టీ నేతల నుంచి ఫోన్లు, సిఫార్సు లేఖలతో తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మరికొందరు అధికారులు తమ కుర్చీ కదలకుండా ఉండేందుకు బేరసారాలకూ దిగుతున్నారు. దీంతో కొంతమంది అధికారులను విశాఖ నుంచి కదపడానికి సాహసించలేకపోతున్నారు. ఇలాంటి వారి జోలికి వెళితే తమకే ఇబ్బందులు ఎదురవుతాయని మిన్నకుండిపోతున్నారు. అర్హులకు అన్యాయం చేస్తున్నారు. ఇలాంటి రికమండేషన్ ఉద్యోగులు ఎక్కువగా రెవెన్యూశాఖ, పంచాయతీరాజ్ శాఖలో ఎంపీడీవోలు, ఇంజినీర్లు, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఉద్యోగులున్నారు.



మన్యమంటే ముఖం చాటేస్తున్నారు

ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంగా బదిలీలు జరుగుతున్నాయి. ఏజెన్సీలో ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని దరఖాస్తులు చేసుకున్నారు. ఉదాహరణకు ఏజెన్సీ నుంచి ముగ్గురు తహసీల్దార్లను విశాఖకు పంపితే, విశాఖ నుంచి ముగ్గురు తహసీల్దార్లను తిరిగి ఏజెన్సీకి పంపాల్సి ఉంటుంది. అక్కడ నుంచి విశాఖకు రావడానికి చాలా మంది ఆసక్తిగా దరఖాస్తు చేసుకున్నారు. కానీ విశాఖ నుంచి ఏజెన్సీకి వెళ్లడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. దీంతో బదిలీల వ్యవహారం ఉన్నతాధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది.

క్లుప్తంగా

'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు'

రోలుగుంట: కొత్తగా ప్రారంభించాల్సిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం బాధాకరమని వైఎస్సార్‌సీపీ నాయకుడు, కన్నడ సినీ నటుడు గొందు సిద్దు అన్నారు. గత ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసి ప్రతిభ గల విద్యార్థులకు వెన్నుదన్నుగా ఉండేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విధానాలు అందుకు భిన్నంగా ఉంటున్నాయన్నారు. వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసే ఎత్తుగడను ఆయన ఖండించారు.

వైభవంగా పవిత్రోత్సవాలు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పూర్ణాహుతి కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. అనంతరం కుంభ ప్రోక్షణ, పవిత్ర విసర్జన, రథబలి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ శిఖరాలకు పవిత్ర సమర్పణ చేశారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేంపజేసి దివ్యప్రబంధ పారాయణాలు, సింహాచలం క్షేత్ర మహత్యం, వేద మంత్రోశ్ఛరణలతో స్వామిని కీర్తించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీసమేతంగా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


మేఘాలయ వ్యవసాయ శాఖ అధికారులతో ఏపీ వ్యవసాయ శాఖ అధికారులు

మహారాణిపేట : ప్రకృతి వ్యవసాయంపై సోమవారం కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఓ హోటల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మేఘాలయ రాష్ట్రం నుంచి అనేక మంది వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సాధికార సంస్థ, ఎంఎస్ మాక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంకేతిక సహాయం, ప్రకృతి వ్యవసాయం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ఏఎస్ఆర్ జిల్లాలోని అరకు, పాడేరు, ఎం.నిట్టాపుట్టు ప్రాంతాల్లో ఇప్పటికే రైతులకు శిక్షణ ఇచ్చామని అధికారులు వెల్లడించారు. వ్యవసాయ శాఖ రీజినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వి.కృష్ణారావు, ఎం.ఎస్. మాక్స్ సీఈవో పి.గంగరాజు, ఎం.కామరాజు, తరుణ్ ఆదిత్య, హేమలత, టి.లక్ష్మణరావు, రిసోర్స్‌పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా చెట్ల నరికివేత


దెబ్బతిన్న బీటీ రోడ్డు


ఆర్అండ్‌బీ స్థలంలో తొలగించిన భారీ వృక్షాల దుంగలు

- వెంచర్‌కు అడ్డుగా ఉన్నాయని ఆర్అండ్‌బీ స్థలంలో తొలగింపు
- ముక్కలుగా చేసి ఎదురుగా ఉన్న కాలువలోకి డంప్ చేసిన వైనం
- యలమంచిలిలో ఓ రియల్టర్ నిర్వాకం

యలమంచిలి రూరల్: తన వెంచర్‌కు అడ్డుగా ఉన్నాయని ఓ రియల్టర్ ఆర్అండ్‌బీ స్థలంలో ఉన్న చెట్లను నరికివేయడం వివాదాస్పదంగా మారింది. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ పెద్దల అండతో భారీ వృక్షాలను యంత్రాలతో పెకిలించి దర్జాగా రహదారిని ఏర్పాటు చేసుకోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. యలమంచిలి పట్టణానికి సమీపంలో వాటర్ సంప్ పక్కన పాత జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలాన్ని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలు చేశారు. ఇటీవల ఈ స్థలాన్ని గ్రావెల్‌తో చదును కూడా చేశారు. అయితే ఈ స్థలంలోకి వెళ్లేందుకు సరైన దారిలేదు. అడ్డుగా పాత జాతీయ రహదారిని ఆనుకుని ఆర్అండ్‌బీ స్థలంలో కొన్ని చెట్లు ఉన్నాయి. బీటీ రోడ్డు నుంచి తన స్థలానికి వెళ్లడానికి అడ్డుగా ఉన్న ఈ చెట్లను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా యంత్రాల సాయంతో ఆదివారం రాత్రి కూల్చివేశారు. ఇంత జరిగినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనక అధికార కూటమి పార్టీ నాయకుల ప్రమేయం ఉందని స్థానికులు చెప్పుకుంటున్నారు.


చెట్లు తొలగించి చదును చేసి ప్రైవేటు స్థలానికి వేసిన రోడ్డు


శ్మశానంలోకి తరలించిన ఆర్అండ్‌బీ స్థలంలో తొలగించిన తాటిచెట్లు

దెబ్బతిన్న బీటీ రోడ్డు

తొలగించిన చెట్లను ముక్కలుగా చేసి, ఎదురుగా ఉన్న పంట కాలువలోకి ఈడ్చుకెళ్లి పడేశారు. తాటిచెట్లను పక్కనే ఉన్న శ్మశానవాటికలో చిందరవందరగా పడేశారు. చెట్లను జేసీబీతో లాక్కుని వెళ్లడంతో బీటీ రోడ్డు దెబ్బతింది. కాలువ పూడుకుపోయింది. పాత జాతీయ రహదారి ప్రస్తుతం రోడ్లు, భవనాల శాఖ నిర్వహణలో ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాధారణ ఎన్నికలకు ముందు బీటీ రోడ్డుపై కొత్తగా లేయర్ వేశారు. ఇప్పుడు ఈ రోడ్డు పాడైపోయింది. యథేచ్ఛగా వాల్టా చట్టానికి తూట్లు పొడిచి ప్రభుత్వ స్థలంలో వృక్షాలను నరికివేయడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ఘటనలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

రోడ్లు, భవనాల శాఖ స్థలంలో చెట్లు నరికి చదును చేసిన వ్యవహారంపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఈ విషయంపై కింది స్థాయి అధికారులు, సిబ్బందికి ఆదేశాలిచ్చాం. బీటీ రోడ్డు ధ్వంసం చేసిన వారిపై పోలీసులకు మా శాఖ తరపున ఫిర్యాదు చేస్తాం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం.

– ఆర్.ఆర్.విద్యాసాగర్, డీఈఈ, ఆర్అండ్‌బీ, యలమంచిలి

దుర్గాదేవిని పూజిస్తే దుఃఖాలు, పాపాలు మాయం



సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనం ఆలకిస్తున్న భక్తజనం

- కష్టపడితేనే అమ్మవారి అనుగ్రహం
- ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మ

అనకాపల్లి: దుర్గాదేవిని పూజిస్తే దుఃఖాలు, పాపాలు పోతాయని, కష్టపడితే గానీ అమ్మవారు అనుగ్రహించదని ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయ శత జయంతి వేడుకల్లో భాగంగా పరమేశ్వరి వైభవంపై ప్రవచనాల చివరి రోజున సోమవారం ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఐశ్వర్యం, రక్షణ రావాలంటే ఇంట్లో దుర్గాదేవి ఫొటో ఉండాలన్నారు. 700 శ్లోకాలు, 500 మంత్రాలు పఠిస్తే పాపాలు పోతాయన్నారు. దుర్గాదేవి స్తోత్రం ప్రతి రోజు అందరూ చదవాలన్నారు. అన్ని జీవులకు దిక్కు నారాయణుడని, సూర్య భగవానుడు మంగళ స్వరూపుడు, సూర్యుడు వల్ల శక్తి వస్తుందని, కాలం బట్టి మనిషి జీవనం విధానం నడుస్తుందన్నారు.

అనంతరం షణ్ముఖశర్మను కమిటీ సభ్యులు సత్కరించి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో శతజయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శారదానదిలో పడి వ్యక్తి మృతి

అనకాపల్లి: మండలంలో మూలపేట గ్రామానికి చెందిన పైలా రాము(46) శారదానదిలో పడి మృతి చెందాడు. సోమవారం ఉమ్మలాడ జంక్షన్ శారదానదిలో మృతదేహం లభ్యమైనట్టు పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పైలా రాము స్వగ్రామం చోడవరం మండలం జి.జగన్నాథపురం. వివాహం తరువాత అనకాపల్లి మండలం మూలపేట గ్రామంలో అత్తవారి ఇంటికి వచ్చి లారీ క్లీనర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 14న బహిర్భూమికని వెళ్లిన రాము ప్రమాదవశాత్తు శారదానదిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు రెండు రోజుల పాటు చుట్టు పక్కల వెతికినా ఫలితం లేదు. మూలపేట శారదానది ఒడ్డున ఉన్న మృతుడి సైకిల్, వస్త్రాలను రాము కుమారుడు మోహన్‌రావు గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎసైన్షియా బాధితులకు వైఎస్సార్‌సీపీ భరోసా


హరిపాలెంలో ఎసైన్షియా క్షతగాత్రుడు వంశీకి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు
- ఇద్దరు క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున చెక్కుల అందజేత

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం ఎసైన్షియా ఫార్మా బాధితులకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దేశంశెట్టి శంకరరావు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు ఇటీవల అచ్యుతాపురంలో జరిగిన ఫార్మా ప్రమాదంలో క్షతగాత్రులైన హరిపాలెంకు చెందిన ఎస్.వంశీ, తంతిడికి చెందిన వర్ధన్‌లకు ఆదివారం పార్టీ శ్రేణులు రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ అచ్యుతాపురం ఫార్మాలో కంపెనీల్లో పనిచేసే కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ఫార్మా బాధితులకు పార్టీ తరపున సాయం అందించిన వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, వైస్ ఎంపీపీ వాసుపల్లి శ్రీను, హరిపాలెం సర్పంచ్ మారిశెట్టి సూర్యనారాయణ, యువజన విభాగం అధ్యక్షుడు శరగడం జగ్గారావు, ఎంపీటీసీ సభ్యులు శోభన్‌బాబు, నాగేశ్వరరావు, ఎంపీటీసీ లాలం శ్రీనివాసరావు, పార్టీ నేతలు గాడి గణేష్, వియ్యపు కృష్ణ, ఈత బాబూరావు, పోలవరపు చెట్టిబాబు, బలిరెడ్డి శ్రీను, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'సెజ్‌కు వ్యవసాయ భూములు తీసుకోవద్దు'


సెజ్‌కు ప్రతిపాదిస్తున్న భూముల్లో సాగులో ఉన్న వరి పంటను పరిశీలిస్తున్న వెంకన్న

కె.కోటపాడు : ఆర్లి ప్రాంతంలో ఎస్ఈజెడ్(సెజ్) ఏర్పాటు కోసం వ్యవసాయ భూములను తీసుకోవద్దని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్లి, గుల్లేపల్లి, గరుగుబిల్లి ప్రాంతాల్లో సెజ్ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు ప్రతిపాదించిన భూములను సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ సెజ్ కోసం ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లిలో 1012 ఎకరాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిలో 602 మంది రైతులకు చెందిన 700 ఎకరాల డీ–ఫారం భూములు ఉన్నాయన్నారు. ఇప్పటికే పరవాడలో సెజ్‌కు 2500 ఎకరాలు, అచ్యుతాపురం ఏరియాలో 12,500 ఎకరాలు కేటాయింపులు చేయగా.. పూర్తి స్థాయిలో కంపెనీల నిర్మాణాలు జరగలేదని ఆయన ఆరోపించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కంపెనీల నుంచి విడుదలైన వ్యర్థాలను సముద్రంలోకి వదులుతుండగా.. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను ఎక్కడికి పంపిచనున్నారో అధికారులు ముందుగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎంపీ సీఎం రమేష్ గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటామని హామీ ఇచ్చి, తరువాత ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వెంకన్న ఆరోపించారు. సెజ్ పేరుతో చేపడుతున్న భూసేకరణను రైతులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, ఈర్లె నాయుడుబాబు, యర్రా దేముడు, వి.సూర్యనారాయణ, ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

అద్దె కారుతో ఉడాయించిన దంపతుల అరెస్ట్

అగనంపూడి(విశాఖ): కారు అద్దెకు తీసుకొని వడ్డీ వ్యాపారికి తాకట్టు పెట్టి ఉడాయించిన దంపతులను దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూర్మన్నపాలెంకు చెందిన బుద్దా వీర మణికంఠ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అదనపు ఆదాయం కోసం కారును నెలసరి వాయిదా పద్ధతిలో కొనుగోలు చేసి ఖాళీ సమయంలో అద్దెకు తిప్పుతున్నాడు. ఈ క్రమంలో ఈఎంఐలు చెల్లించడానికి ఇబ్బందులు పడుతుండడంతో కారును ఆన్‌లైన్‌యాప్ ఓఎల్ఎక్స్‌లో విక్రయానికి పెట్టాడు. దీంతో మల్కాపురానికి చెందిన దంపతులు ఎరుపల్లి రవీంద్ర, రూపాశ్రీలు వీరమణికంఠను కలిసి కారు అమ్మడం ఎందుకు తమకు అద్దెకు ఇస్తే నెలకు రూ.35వేలు చెల్లిస్తామని నమ్మబలికారు. దీంతో మణికంఠ వీరికి కారు అద్దెకు ఇచ్చాడు. మొదటి నెల అద్దె చెల్లించి నమ్మకం కల్పించారు. తరువాత నుంచి అద్దె చెల్లించక, ఫోన్లకు సరిగా సమాధానం చెప్పకపోవడంతో మణికంఠ దంపతులను నిలదీశాడు. ఇదిగోఅదిగో అంటూ మాయమాటలు చెప్పారు. తీరా రవీంద్ర ఇంటికి తాళాలు వేసి ఉండడంతో ఆచూకీ కోసం జీపీఎస్ ద్వారా ట్రాక్ చేయగా అనకాపల్లి జిల్లా కాకరాపల్లికి చెందిన వడ్డీ వ్యాపారికి రూ.2 లక్షలకు కారును తాకట్టు పెట్టినట్టు తెలుసుకొన్నాడు. మణికంఠ ఫిర్యాదు మేరకు విచారించిన దువ్వాడ పోలీసులు.. రవీంద్ర, రూపాశ్రీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వందే భారత్ సందడి



తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖకు మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే విశాఖపట్నం–సికింద్రాబాద్, భువనేశ్వర్– విశాఖపట్నం, సికింద్రాబాద్– విశాఖపట్నం మధ్య వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఇది విశాఖ నుంచి ప్రయాణించే నాలుగోది అవుతుంది. రాయ్‌పూర్–విజయనగరం మార్గంలో ఇది మొదటిది. ఈ రైలు ఈనెల 20 నుంచి రెగ్యులర్‌గా గురువారం మినహా వారానికి ఆరు రోజులపాటు రాకపోకలు సాగించనుంది. దుర్గ్–విశాఖపట్నం(20829) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 5.45 గంటలకు దుర్గ్‌లో బయల్దేరి మధ్యాహ్నం 1.55 గంటలకు వైజాగ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం–దుర్గ్(20830) వందేభారత్ రైలు మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి రాత్రి 10.50 గంటలకు దుర్గ్‌కు వెళ్తుందని తెలుస్తోంది. సోమవారం విశాఖలో జరిగిన రైలు ప్రారంభోత్సవం కార్యక్రమంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీభరత్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బి.ఎస్.కె.రాజ్‌కుమార్, కలెక్టర్ హరీందర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైలు ఎక్కి సందడి చేశారు.





అదృశ్యమైన యువకుని మృతదేహం లభ్యం


బుజ్జి మృతదేహం


బుజ్జి(ఫైల్)

మునగపాక: అదృశ్యమైన అరబుపాలెం ఇటుకబట్టీలో పనిచేసే యువకుని మృతదేహం సోమవారం లభ్యమైంది. బుచ్చెయ్యపేట మండలం ఉప్పరగూడెంకు చెందిన గుత్తల బుజ్జి అరబుపాలెంలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 14న ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు బుజ్జి కోసం వాకబుచేసిన ఫలితం లేకపోయింది. దీంతో మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడు అదృశ్యమైనట్టు కేసు నమోదు చేసిన ఎస్ఐ ప్రసాదరావు.. ఇటుకబట్టీకి సమీపంలో ఉన్న సాగునీటి కాలువలో బుజ్జి కోసం ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మునగపాక ఇందిరమ్మ కాలనీ సమీపంలోని కాలువలో మృతదేహాన్ని గుర్తించారు. బుజ్జి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి 100 పడకల ఆస్పత్రికి తరలించారు. కేసును ఎస్ఐ ప్రసాదరావు దర్యాప్తు చేస్తున్నారు.

నీటిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



పాయకరావుపేట : గుంటపల్లి గ్రామ శివారు పెద్దిపాలెం సమీప ఆవలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఏఎస్ఐ గోవింద తెలిపారు. సుమారు 45 సంవత్సరాల వయస్సు గల పురుషుడి మృతదేహం నీటిలో పడి ఉందన్నారు. మృతుడు నలుపు రంగు ఫుల్ ప్యాంట్, సిమెంట్ రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. ఎటువంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని నక్కపల్లి మార్చురీకి తరలించినట్టు ఏఎస్ఐ తెలిపారు. ఆర్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

ఎంవీపీకాలనీ(విశాఖ): భార్యను హత్యచేసిన ఘటనలో భర్త డానియేల్‌ను ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన డానియేల్, సీలేరుకు చెందిన సలోమి (28) 2018లో ప్రేమ వివాహం చేసుకున్నారు. విశాఖలోని నక్కవానిపాలెం శివాలయం వీధిలో ఉంటున్నారు. డానియేల్ ఎండాడలోని ఓ చర్చిలో పనిచేస్తుండగా సలోమి నగరంలోని ఓ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు(కవలలు) ఉన్నారు. భార్యపై డానియేల్‌కు అనుమానం ఉండటంతో ఇరువురి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగగా క్షణికావేశంలో డానియేల్ ఆమెను కొట్టడంతో పాటు చున్నితో ఫ్యాన్‌కు ఉరివేసి హత్యచేశాడు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి రావడంతో డానియేల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అతని సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

మత్తు మాత్ర ఇచ్చి లైంగిక దాడి

- వరుసకు చెల్లిపై కన్ను
- పోలీసుల అదుపులో నిందితుడు

మల్కాపురం(విశాఖ): చట్టాలు ఎన్ని వచ్చినా.. మహిళలపై లైంగిక దాడులు ఆగడం లేదు. తాను మనిషినన్న విషయాన్ని కూడా మరిచిపోతున్న కామాంధులు.. మదమెక్కిన మృగంలా వ్యవహరిస్తూ మానవత్వానికే మాయని మచ్చని తెస్తున్నారు. కామంతో కళ్లు మూసుకుని.. వరుసకు చెల్లిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు ఓ మృగాడు. మల్కాపురంలో ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటనకు సంబంధించి పోలీసుల తెలిపిన వివరాలు ఇలా.. శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన జోగి పాపారావు స్థానికంగా ఓ సెల్ షాపు నడుపుతున్నాడు. వరసకు బావమరిది అయిన బంధువు ప్రేమ వివాహం చేసుకుని 2021 నుంచి పాపారావు ఇంటి సమీపంలోనే నివాసముంటున్నాడు. హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్ట్ కార్మికుడి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన పనుల నేపథ్యంలో సొంతూరు పలాస వెళ్లాడు. తన భార్యకు ఏ అవసరం వచ్చినా కాస్త సాయం చేయాలని చెప్పాడు. ఈ నెల 9వ తేదీన అతని భార్యకు జ్వరం రావడంతో మందులు తీసుకురావాలని పాపారావును కోరింది. ఇదే అదునుగా పాపారావు జ్వరం మందులతో పాటు మత్తు టాబ్లెట్ కూడా తీసుకువెళ్లి బాధితురాలికి ఇచ్చాడు. ఈ మాత్ర వేసుకుంటే త్వరగా జ్వరం తగ్గుతుందని దగ్గరుండి మరీ వేయించాడు. దీంతో కొద్దిసేపటికే ఆమె మత్తులోకి జారుకుంది. దీంతో పాపారావు ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. కోలుకున్న బాధితురాలు జరిగిన ఘటనను తల్లిదండ్రులకు వివరించి రోదించింది. తల్లిదండ్రుల సాయంతో ఆదివారం సాయంత్రం మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాపారావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధితురాలిని కేజీహెచ్‌కు వైద్య పరీక్షల నిమిత్తం తరలించారు. సీఐ విద్యాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటరుగా చేరండి

మహారాణిపేట(విశాఖ): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసి మూడు నెలలు గడిచింది. ఇప్పుడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటితో పూర్తవుతుంది. నిర్ణీత సమయంలో ఎన్నికలు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓటు నమోదు ప్రక్రియకు జిల్లా అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి ఈ నెల 30న నోటిఫికేషన్ జారీ చేస్తారు. నవంబర్ 6 వరకు ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. నవంబర్ 23న ఓటర్ల నమోదుపై డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తారు. దీనిపై నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పాత ఓటర్ల జాబితాను పరిగణలోనికి తీసుకోరు. కొత్తగా ఓటు హక్కుకు అర్హులైన వారితో పాటు గతంలో ఓటు హక్కు ఉన్నవారు కూడా మరలా నమోదు కావాల్సి ఉంటుంది. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఫారం 19 ద్వారా ఓటు హక్కును పొందాల్సి ఉంటుంది. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సెకండరీ పాఠశాల, ఆపై సంస్థల్లో పని చేస్తూ నవంబర్ ఒకటో తేది నాటికి గత ఆరేళ్లలో మూడేళ్ల సర్వీసు నిండిన వారు అర్హులు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు లేక పోయినా అర్హత కలిగి ఉంటే ఈ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కావచ్చు. ఫారం–19తోపాటు ఫొటో, సర్వీస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు(ఆప్షనల్), ఓటర్ ఐడీ కార్డు/నివాస ధ్రువీకరణపత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేసి రసీదు పొందవచ్చు.

సహస్ర దీపాలంకరణ సేవ మండపానికి శంకుస్థాపన

- సింహగిరిపై కేశ ఖండన శాల భవనం ప్రారంభం
- ఉత్సవ మార్గదర్శి పుస్తకాన్ని ఆవిష్కరించిన అశోక్‌గజపతి


సహస్ర దీపాలంకరణ సేవ మండపం పనులకు శంకుస్థాపన చేస్తున్న అశోక్‌గజపతిరాజు

సింహాచలం: సింహగిరిపై రాజగోపురం సమీపంలో దాత సహకారంతో నిర్మించనున్న సహస్రదీపాలంకరణ మండపం పనులకు సోమవారం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు శంకుస్థాపన చేశారు. 2014 డిసెంబర్‌లో దేవస్థానంలో సహస్రదీపాలంకరణ సేవ ప్రవేశపెట్టారు. ప్రతీ శనివారం సాయంత్రం 5.30గంటల నుంచి 6.30గంటల వరకు ఈసేవ జరిగేది. 2020లో కోవిడ్ కారణంగా ఆ సేవను నిలిపివేశారు. ఇటీవల మళ్లీ పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సహస్రదీపాలంకరణ సేవకు ప్రత్యేక మండపాన్ని నిర్మించేందుకు విశాఖకు చెందిన దాత నారాయణరెడ్డి ముందుకువచ్చారు. ఆ పనులకు అశోక్‌గజపతిరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈఈలు పాల్గొన్నారు.

కేశఖండనశాల నూతన భవనం ప్రారంభం

సింహగిరిపై కేశఖండనశాల నూతన భవనాన్ని అశోక్ గజపతిరాజు సోమవారం ప్రారంభించారు. గంగధారకి వెళ్లే మార్గంలో ప్రస్తుతం ఉన్న కేశఖండనశాల భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోతుండటంతో పక్కనే ఇటీవల నిర్మించిన క్యూకాంప్లెక్స్ పై అంతస్తులోకి కేశఖండనశాలను రూ.8 లక్షలో ఆధునికీకరించారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సంవత్సరం కాలంలో జరిగే నిత్య, వార,పక్ష, మాస, విశేష ఉత్సవాలతో సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి రూపొందించిన నమూనా పుస్తకాన్ని అశోక్‌గజపతిరాజు ఆవిష్కరించారు.

క్లుప్తంగా

సీఆర్‌ఎంటీ ఉద్యోగ భద్రతపై భయాందోళన

అనకాపల్లి: నూతన విద్యా విధానం -2020లో భాగంగా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో క్లస్టర్ రిసోర్స్ సెంటర్ పునర్ వ్యవస్థీకరణ జరుగుతున్నప్పటికీ, క్లస్టర్ పరిధి ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుందని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పూడి వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా శాఖలో కీలక అంశమైన క్లస్టర్ రిసోర్స్ సెంటర్లను కుదిస్తున్నారన్నారు. దీంతో క్లస్టర్ ప్రాతిపదికన రోస్టర్ విధానంలో ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతుందన్నారు. 12 సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనంతో విద్యా శాఖ సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వాలు ఎప్పుడైనా సీఆర్‌ఎంటీ/సీఆర్పీలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు.

స్వాములకు సత్కారం



శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో స్వాముల సత్కార కార్యక్రమం

తుమ్మపాల: వినాయక నవరాత్రులు పురస్కరించుకుని పట్టణంలో ఎన్టీఆర్ యార్డ్ శ్రీలక్ష్మి గణపతి ఆలయ ఆవరణలో నిత్యాన్నదానం చేపట్టినట్లు ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. పట్టణంలో 120 మందికి పైగా వినాయక మాలలు ధరించి నిత్య పూజలు చేయడం ఇక్కడ ప్రత్యేకమన్నారు. జిల్లాలో చోడవరం స్వయంభూ దేవాలయం తదుపరి ఇక్కడ వినాయకుడు ప్రసిద్ధి చెందాడని గురుస్వామి మళ్ల సురేంద్ర తెలిపారు. సోమవారం స్వాములందరిని సత్కరించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్వాములు మళ్ల సూరిబాబు, యల్లపు నూకరాజు, మల్ల గోపి, పాలిమేర ఆనంద్, పోలవపు త్రినాథ్ పాల్గొన్నారు.

పెరిగిన టమాటా ధర

కశింకోట: తాళ్లపాలెంలో సోమవారం జరిగిన వారపు సంతలో టమాటా ధర పెరిగింది. మిగిలిన కూరగాయల ధరలు కూడా బెట్టు మీదే ఉన్నాయి. గత వారం కిలో టమాటా రూ.40 ఉండగా, ఈ వారం రూ.50కి పెరిగింది. ఉల్లి బెట్టు దిగలేదు. కిలో రూ.60కి విక్రయించారు. బంగాళాదుంప, బెండకాయ, వంకాయ రూ.40, బీట్‌రూట్, క్యారెట్, గోరు చిక్కుడు, బరబాటి రూ.60, క్యాప్సికం రూ.80, చిక్కుడు రూ.160కి విక్రయాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 232 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	5,080
రెండో రకం	3,550	4,300
మూడోరకం	3,100	3,350

అనకాపల్లి సినిమాలు

35..చిన్నకథకాదు	: రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్	: సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్తిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
ఉత్సవం	: వెంకటేశ్వర
కళింగ	: శ్రీసత్య
భలేఉన్నాడే	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-11 యూనిట్లు, ఏబీ పాటిజివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రమాదకరంగా ఏలేరు కాలువ బ్రిడ్జి

- వర్షం కురిస్తే దానిపై నుంచే పారుతున్న నీరు
- అనకాపల్లి- విశాఖ హైవేలో గోతులు
- వాహనచోదకుల ఇక్కట్లు
- పట్టించుకోని ఎన్‌హెచ్‌ఐ అధికారులు



బ్రిడ్జిపై చేరిన వర్షపు నీరు



ఏలేరు కాలువ బ్రిడ్జిపై గోతులు

అనకాపల్లి: మండలంలో అనకాపల్లి- విశాఖ జాతీయ రహదారిలో ఏలేరు కాలువ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. రాత్రిళ్లు ప్రయాణించే వాహనదారులకు ఎక్కడ గొయ్యి, ఎక్కడ నీరు ఉందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కూర్మనపాలెంలో స్టీల్ ప్లాంట్ స్థాపన సమయంలో జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎస్‌ఆర్‌పేట ఏలేరు కాలువ వద్ద దీన్ని నిర్మించారు. ఇది ఎత్తు తక్కువ కావడంతో వర్షాకాలంలో వర్షపు నీరు దానిపై పారుతోంది. వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆ సమయంలో పోలీసు సిబ్బంది జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు... మండలంలో కొత్తూరు, కొప్పాక, కొత్త తలారివానిపాలెం, సిరసపల్లి, గోపాలపురం, మారేడుపూడి, రాజుపాలెం, వల్లూరు, గ్రామాల ప్రజలు అనకాపల్లికి వెళ్లాలంటే కేఎస్‌ఆర్‌పేట ఏలేరు కాలువ వద్ద బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తారు. ఇక్కడ జాతీయ రహదారిలో విశాఖ నుంచి తుని, కాకినాడ, యానాం, విజయవాడ, హైదరాబాద్, ఖమ్మం, తిరుపతి, తదితర సుదూర ప్రాంతాలకు



శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి రక్షణ గోడ

నిత్యం వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇదే బ్రిడ్జిపై పెద్ద గోతులు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు బ్రిడ్జిపై నుంచి రహదారిపైకి ప్రవహించడంతో వారంతా భయాందోళనకు గురవుతున్నారు.

ఇబ్బందులతోనే నిమజ్జనాలు...
జీవీఎంసీ విలీన గ్రామమైన ఏఎస్‌ఆర్‌పేట, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, సిరసపల్లి, కొత్త తలారి



బ్రిడ్జిపై గోతులో ఇరుక్కున ఆటో చక్రం

వానిపాలెం, మారేడుపూడి గ్రామాలతోపాటు గాజువాక, కూర్మనపాలెం పురవీధుల్లో ఏర్పాటు చేసిన వినాయక, దేవీ నవరాత్రుల విగ్రహాలను జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎస్‌ఆర్‌పేట ఏలేరు కాలువ బ్రిడ్జి వద్దనే 25 సంవత్సరాలుగా నిమజ్జనం చేస్తున్నారు. బ్రిడ్జికి సమీపంలో ఎటువంటి విద్యుత్ లైట్లు లేకపోవడం, ప్రమాదం అని తెలిసినా ప్రత్యామ్నాయ మార్గం లేక ఇక్కడే నిమజ్జనోత్సవాలు చేస్తున్నారు.

రాత్రిళ్లు రైతులకు కష్టాలు
మండలంలో వివిధ గ్రామాల రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు రాత్రి సమయంలో అనకాపల్లి మార్కెట్‌కు తీసుకొస్తారు. అటువంటి సమయంలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. బ్రిడ్జికి 30 అడుగుల దూరంలో కొప్పాక గ్రామం ప్రజలు నివసిస్తున్నారు. ఇక్కడ రహదారి దాటి వస్తున్న సమయంలో ప్రమాదాలకు గురై మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఏలేరు కాలువకు కూతవేటు దూరంలోనే రైల్వే ట్రాక్‌లు ఉన్నాయి. వీటిపై నిర్మించిన రైల్వే బ్రిడ్జిపై గోతులు పడ్డాయి. దీంతోపాటు ఏలేరు కాలువ బ్రిడ్జిపై ప్రయాణం చేయాలంటే వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు.

బ్రిడ్జి కూలకముందే చర్యలు తీసుకోవాలి



నిత్యం ఏలేరు కాలువ బ్రిడ్జిపై నుంచి అనకాపల్లి కూరగాయల మార్కెట్‌కు వెళ్తుంటాను. బ్రిడ్జిపైనా జాతీయ రహదారిలో భారీ గోతులు పడడంతో వాహనాలు బోల్తాపడి ఇబ్బంది పడుతున్నాం. వారం రోజుల క్రితం రూరల్ పోలీస్‌లు క్రషర్ బుగ్గ వేశారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించడం, కాలువలో నీరు రహదారిపైకి రావడంతో మరలా పాడైపోయింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఐ) శాశ్వత పరిష్కారం చూపాలి.

– ఏసురత్నం, రైతు, అనకాపల్లి

నా ద్విచక్రవాహనం పాడైంది



వారం రోజుల క్రితం విశాఖలో శుభకార్యానికి అనకాపల్లి నుంచి వెళ్లాను. అదేరోజు రాత్రి అనకాపల్లి తిరిగి వస్తున్న సమయంలో రాత్రి 10 గంటల సమయంలో బ్రిడ్జికి, రహదారికి మధ్య భారీ గోతులో పడి ద్విచక్ర వాహనం ముందుభాగం విరిగిపోయింది. అక్కడ చాలా ఇబ్బంది పడ్డాను. వెంటనే స్నేహితుడికి ఫోన్ చేసి బైక్ తెప్పించాను. పాడైపోయిన బైక్ రహదారి పక్కన విడిచిపెట్టి ఇంటికెళ్లిపోయాను. మరుసటి రోజు ఉదయం వచ్చి ఆటోలో దాన్ని ఎక్కించుకుని రిపేరు చేయించుకున్నాను.

– హుస్సేన్, అనకాపల్లి

పీఏసీఎస్‌లపై ఐటీ దాడులు తగదు

ఎంపీ రమేష్‌కు యూనియన్ నాయకుల వినతి

కశింకోట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలపై ఆదాయపు పన్ను శాఖ దాడులను నివారించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా పీఏసీఎస్‌ల యూనియన్ ప్రధాన కార్యదర్శులు గొంప రమణ, బొడ్డేడ రమణ, కోశాధికారి యల్లపు లక్ష్మణరావు కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం అనకాపల్లిలో ఎంపీ సీఎం రమేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రైతులకు రుణాలు అందించి చేదోడుగా నిలవడానికి సేవా దృక్పథంతో ఏర్పాటైన ఉమ్మడి విశాఖ జిల్లా పీఏసీఎస్‌లపై అపరాధ రుసుంతో ఆదాయపు పన్ను చెల్లించాలని నోటీసులు జారీ చేశారన్నారు. రైతులకు ఎటువంటి ఆర్థిక సేవలు అందించకుండా సహకార సంఘాల ఖాతాలను సీజ్ చేస్తున్నారని విమర్శించారు. దీంతో రైతులకు సేవలు అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. దీని దృష్ట్యా ఆదాయపు పన్ను శాఖ దాడులను నివారించాలని వినతి పత్రం అందించగా, ఎంపీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని సహకార సిబ్బంది పాల్గొన్నారు.

19 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

అనకాపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల ఎంపిక పోటీలు ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పాఠశాలల మండల ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ ఎస్.వి.నరసింహం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ -14, 17 బాల బాలికల విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. 19న జీవీఎంసీ గవరపాలెం చిన్న హైస్కూల్‌లో ఖో-ఖో, యోగా, చెస్ పోటీలు, 20న జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌లో వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, 21న ఎన్టీఆర్ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్ (బాలురు) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలన్నారు. అండర్-14కు 2011 జనవరి 1వ తేదీ, అండర్-17కు 2008 జనవరి 1వ తేదీ నాటికి జన్మించి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9247150037 సంప్రదించాలని కోరారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

అనకాపల్లి: పట్టణంలో ముస్లిం సోదరులు సోమవారం మిలాద్-ఉన్-నబీ పండగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక చిన్న నాలుగురోడ్ల జంక్షన్‌లో ఉన్న జామియా మసీదు నుంచి పెరుగుబజార్ జంక్షన్, మెయిన్‌రోడ్డు మీదుగా వేల్పులవీధి జంక్షన్, నెహ్రూచౌక్ మీదుగా జామియా మసీదు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.హుస్సేన్ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు.

రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలతో ఇబ్బందులు

పరవాడ: గ్రామీణ ప్రాంత రహదారులకు ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నాయి. మండలంలో వాడచీపురుపల్లి-దలాయిపాలెం, వాడచీపురుపల్లి-వెంకటాపురం, నాయుడుపాలెం-తంతడి, తంతడి రోడ్డు-ముత్యాలమ్మపాలెం రోడ్డు, జాజులవానిపాలెం-కలపాక, గొర్లివానిపాలెం-బొడ్డపువానిపాలెం, భర్నికం-తానాం రహదారులకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. ఈ రహదారులపై రాకపోకలు సాగించే కార్మికులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు ఈ ముళ్లపొదల కారణంగా గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



దలాయిపాలెం రహదారిలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు

భారీ గోతులు.. ఎగసిపడుతున్న ధూళి

- లంకెలపాలెం-సబ్బవరం దారిలో ప్రయాణికుల అవస్థలు



అధ్వానంగా మారిన సబ్బవరం రహదారి



పెదముషిడివాడ రహదారిలో కమ్ముకున్న ఫ్లైయాష్ ధూళి

పరవాడ: లంకెలపాలెం-సబ్బవరం రహదారిలో రాకపోకలు సాగిస్తున్న ఫ్లైయాష్ లారీల కారణంగా ఎగసిపడుతున్న ధూళి ప్రజల ఆరోగ్యాలను హరిస్తోందని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టన్నుల కొద్దీ బూడిదను భారీ వాహనాల ద్వారా తరలిస్తుండటంతో రోడ్డు అధ్వానంగా మారింది. ప్రయాణికులు నానా అగచాట్లు పడుతున్నారు.

సింహాద్రి ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి బూడిదను ఎగుమతి చేస్తున్న లారీలు లంకెలపాలెం మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిపై ఎలాంటి టార్పన్లు వేయకుండా రవాణా చేస్తుండటంతో దారంతా ఎగసిపడుతున్న ధూళి ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతోంది. ధూళిని పీల్చడం వలన గొంతు, కళ్ల మంటలతో పాటు శ్వాసకోశ, చర్మవ్యాధుల బారిన పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో బూడిద కళ్లల్లో పడి, ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధిక బరువు కలిగిన బూడిద లారీలు నిత్యం రాకపోకలు సాగించడం వలన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఎక్కడికక్కడ భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళ రహదారిలో ప్రయాణం భయంగొలుపుతోంది. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో ఏది రోడ్డో.. ఏది గొయ్యో తెలియక ప్రమాదాలన బారిన పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. బూడిద రవాణాలో జాగ్రత్తలు పాటించి, రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఓజోన్ పొరను కాపాడండి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఎస్.రాయవరం: ఓజోన్ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పీఆర్‌టీయూ సమన్వయ కర్త చోడిశెట్టి సత్యనారాయణ కోరారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎస్.రాయవరంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అడ్డురోడ్డు, పెదగుమ్ములూరు, తిమ్మాపురం గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొర సమస్య వల్ల వేడి పెరుగుతోందన్నారు. వాతావరణం కాలుష్యం మానవ మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఓజోన్ పొర దెబ్బతినడం వల్ల సూర్యుడి నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాలు 97 శాతం నుంచి 99 శాతం నేరుగా భూమిపై పడి జీవాన్ని దెబ్బతీసే సామర్థ్యం కలిగి ఉంటాయని చెప్పారు. వీటి వల్ల చర్మ, జన్యు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏలేరు గండి పూడ్చివేత పనులు



చివరి దశకు చేరుకున్న గండి పూడ్చివేత పనులు

మామవరపాలెం : ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు కొనసాగుతున్నాయి. రాచపల్లి వద్ద 99వ కిలోమీటరు ప్రాంతంలో ఏలేరు కాలువకు ఆదివారం ఉదయం గండి పడింది. అదే రోజు సాయంత్రం నుంచి జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణలో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గండి పూడ్చివేతకు ఆటంకం కలిగింది. దీంతో సోమవారం సాయంత్రానికి 80 శాతం పనులు పూర్తయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం నాటికి పనులు పూర్తవుతాయని డీఈ కామేశ్వరరావు తెలిపారు. గండి పూడ్చివేత పనులను నర్సీపట్నం ఆర్డీవో జయరాం, తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు.

తరలిన గణనాథులు

వాడవాడలా అన్నసమారాధనలు, నిమజ్జనోత్సవాలు



కశింకోటలోని పందిరి వీధిలో ట్రాక్టర్‌పై వినాయకుడి ఊరేగింపు



పాల కేంద్రం వద్ద పవర్ వినాయకుడిని దర్శించుకుంటున్న మండలాధ్యక్షుడు కిషోర్



గవరపేట పెద్ద గుమ్మం వద్ద శారదానదిలో దోనెలపై వినాయక విగ్రహ నిమజ్జనం

కశింకోట: వినాయక నవరాత్రులు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా వాడవాడలా భారీ అన్న సమారాధనలు, గణేష్ విగ్రహాలు, ప్రతిమల నిమజ్జనోత్సవాలు సోమవారం కనుల పండువగా జరిగాయి. స్థానిక పాల కేంద్రం వద్ద పవర్ వినాయకుని విగ్రహం మండపం ఆవరణలో ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ యువ నాయకుడు మలసాల కుమార్‌రాజా, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ తదితరులు వినాయకుడిని దర్శించుకున్నారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. గవరపేటలోని పెద్ద గుమ్మం వద్ద నెలకొల్పిన వినాయకుని వద్ద, మేదరవీధి కనకమహాలక్ష్మి వీధి, సంతబయల తాపీమేస్త్రీల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద, పలుచోట్ల భారీ అన్నసమారాధన నిర్వహించారు. లడ్డూల వేలం పాటలు నిర్వహించారు. వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని ఎక్కువ ధరకు పోటీపడి పాడుకొని ఇళ్లకు తీసుకెళ్లారు. పలు గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక దుర్గమాంబ ముఖ ద్వారం వద్ద, గవరపేటలోని ఆళ్ల వారి వీధి, అగ్రహారం, మేదరవీధి తదితర చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మహిళలు, చిన్నారుల కోలాటాలు, నృత్యాలు, తీన్‌మార్ డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఘనంగా వ్యాన్లు, రిక్షాలపై ఊరేగించారు. కుమ్మరి వీధి వద్ద వినాయకుడికి ఎండ తగలకుండా గొడుగు వేసి మరీ వీధుల్లో ట్రాక్టర్‌పై ఊరేగించారు. ఆ సమయంలో ప్రజలు వినాయక విగ్రహాలను దర్శించి పూజలు చేశారు. ప్రసాద వితరణ చేశారు. అనంతరం స్థానిక శారదా నదిలో వినాయక విగ్రహాలను, ప్రతిమలను నిమజ్జనం చేశారు. స్థానిక పెద్ద గుమ్మం వద్ద శారదా నదిలో దోనెల మీదుగా తీసుకెళ్లి నది మధ్యలో వినాయక నిమజ్జనాలు చేశారు. దీన్ని ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించి భక్తి పారవశ్యం చెందారు.



శిల్పరశెట్టివారి వినాయకుని విగ్రహం ఊరేగింపు



నిమజ్జనోత్సవంలో చిన్నారుల తీన్‌మార్ వాయిద్యాలు



నిమజ్జనోత్సవంలో చిన్నారుల కోలాటాల ప్రదర్శన



దుర్గమాంబ ముఖ ద్వారం వద్ద ట్రాక్టర్‌పై వినాయక విగ్రహం ఊరేగింపు

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ జరుగుతుందని ఆరోగ్య విస్తరణ అధికారి సూరిశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2,220 మంది విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 913 మంది పిల్లలకు ఈ మాత్రలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

ఈ క్రాప్ నమోదు గడువు పెంపు

మాడుగుల రూరల్ : ఖరీఫ్ సీజన్ పంటలకు ఈ-క్రాప్ నమోదు గడువును ఈ నెల 25 వ తేదీ వరకు పొడిగించినట్టు మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత ఈ నెల 15 వ తేదీ వరకు గడువు విధించగా, రాష్ట్రంలో వరదల కారణంగా గడువును మరో 10 రోజులు పొడిగించారన్నారు. ఈ-క్రాప్ నమోదు చేస్తేనే పంటల బీమా అమలు అవుతుందని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు.